## క్లుప్తంగా

### రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రెండో సెగ్మెంట్‌లో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ఎంపీపీ పాలడుగు జోత్స్న బుధవారం భూమిపూజ చేశారు. రూ.80 లక్షల వ్యయంతో రెండో సెగ్మెంట్ పరిధిలోని రామకృష్ణనగర్, పండిట్ నగర్, రాజీవ్‌నగర్, తిరుమలశెట్టి నగర్‌లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించనున్నట్లు ఎంపీపీ తెలిపారు. గత పాలకులు ఈ ప్రాంత ప్రజలను ఓటు బ్యాంకులుగా వాడుకుని అరకొర అభివృద్ధి చేశారన్నారు. తమని నమ్మి ఓటేసిన ప్రజలకు అండగా ఉండి అభివృద్ధికి కట్టుబడి చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పాలడుగు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### హ్యాండ్‌బాల్ పోటీలకు మేఘన



మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని యు.మేఘన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. పటమట జెడ్పీ పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభతో గోల్డ్‌మెడల్ సాధించింది. ప్రతిభ ఆధారంగా సెలక్షన్ కమిటీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం డేవిడ్‌రాక్ ఫెల్లర్ బుధవారం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు సురేంద్రబాబు, వహీదాబేగం, శ్రీనివాసరావు బాలికను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు.

### పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీలోని 19వ వార్డులో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో పైప్‌లైన్ నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి రూ.5లక్షల కేటాయించినట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరతిగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చుతామని తెలిపారు. సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, వార్డు కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మీ, చిన్నయ్య, దయాకర్, రవి, పండు పాల్గొన్నారు.

### బాలల హక్కులపై అవగాహన ఉండాలి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ బాలభవన్ ఏరియా కో–ఆర్డినేటర్ ప్రియాంక అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల కార్యక్రమం గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో బుధవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ నేటి బాలలను మాదకద్రవ్యాలు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాలన్నారు. వీటితో మంచికంటే చెడు ఎక్కువగా ఉందన్నారు. సోషల్ మీడియా యువతపై ప్రభావం అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

### పోలీస్ అధికారులెవరూ ఒత్తిడి చేయలేదు

నూజివీడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నిమిత్తం బందోబస్తుకు వచ్చే సిబ్బందికి ఉచితంగా భోజనం, టిఫిన్లు అందించాలని పోలీస్ అధికారులెవరూ తమపై ఎలాంటి ఒత్తిడి చేయలేదని పట్టణంలోని పలు హోటళ్ల నిర్వాహకులు స్పష్టం చేశారు. సీఎం పర్యటనకు బందోబస్తుగా వచ్చే పోలీస్ సిబ్బందికి ఉచితంగా భోజనాలు, ఆహారం అందించాలని హోటళ్లపై ఒత్తిడి చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తూ ఎల్లో మీడియాలో బుధవారం ప్రచురితమైన కథనాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా హోటళ్ల నిర్వాహకులు మాట్లాడుతూ భోజనం ధర ఎంత అని పోలీసు అధికారులు అడిగారని, తాము ధర చెప్పామని, ఎక్కువ మంది ఉన్నందున చెప్పిన ధరకు రూ.10 తగ్గించమని మాత్రమే అడిగారని తెలిపారు. ఉచితంగా అందించాలని అధికారులెవరూ ఒత్తిడి చేయలేదని, అలాంటి ఆరోపణ అవాస్తమని హోటళ్ల నిర్వాహకులు స్పష్టం చేశారు.

### 24లోగా జాయింట్ బ్యాంకు ఖాతా తెరవాలి

నూజివీడు: జగనన్న విద్యాదీవెన పథకం నాలుగో విడత లబ్ధి పొందేందుకు ఈ నెల 24వ తేదీ లోగా ఏదైనా జాతీయ బ్యాంకులో విద్యార్థి, తల్లి కలిసి జాయింట్ అకౌంట్ తెరవాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాశ్ బుధవారం తెలిపారు. నూజివీడులో ఆయన మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ పూర్తయిన వారు, ఎస్సీ విద్యార్థులు మినహా మిగిలిన వారు తప్పనిసరిగా జాయింట్ అకౌంట్ తెరవాలన్నారు. విద్యార్థి మొదటి, తల్లి రెండో హోల్డర్‌గా ఉండాలని, ఒకవేళ తల్లి మరణిస్తే తండ్రి లేదా సంరక్షకుడని సెకండరీ హోల్డర్‌గా ఉంచాలని సూచించారు. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే అందరూ కలిసి ఒకే బ్యాంకు అకౌంట్ తెరవవచ్చన్నారు. ఏటీఎం, నెట్ బ్యాంకింగ్ సేవలు ఉండకూడదని, జాయింట్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ అవసరంలేదని పేర్కొన్నారు. అర్హులైన వారు జాయింట్ అకౌంట్ తెరిస్తే ఈ నెల 28న జగనన్న విద్యా దీవెన నిధులు నూతన జాయింట్ ఖాతాలో జమ అవుతాయని తెలిపారు.

# నవరత్నాలతో ప్రజలకు ఎంతో మేలు

**ఎమ్మెల్యే రక్షణనిధి**





గంపలగూడెం మండలం కొత్తపల్లిలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే రక్షణనిధి ఏ.కొండూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి(గంపలగూడెం): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుపర్చిన నవరత్నాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం కొత్తపల్లిలో బుధవారం నిర్వహించిన పల్లెకు పోదాం, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. నాడు–నేడుతో విద్యారంగం, జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్యరంగాల్లో విప్లుత్మ మార్పులు తీసుకొచ్చారన్నారు. రైతుకు, కార్మికులకు మేలు చేసేందుకు ఎంతో కృషి చేసిందన్నారు. నవరత్నాలను అర్హతే ప్రామాణికంగా అమలు పరచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గడచిన నాలుగున్నర సంవత్సరాలుగా గ్రామంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంభందించిన డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, సర్పంచ్ నరెడ్ల ఓగిరెడ్డి, మాజీ సర్పంచ్ వైకుంఠం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ నర్సారెడ్డి, జీ చెన్నకేశవరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు**

ఏ.కొండూరు: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జెడ్పీటీసీ భూక్యగనియా పేర్కొన్నారు. ఏ.కొండూరు సచివాలయంలో బుధవారం పల్లెకుపోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అభివృద్ధి సంక్షేమం డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంపాటి రజిని, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్దం పద్మ, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నారావు, సతీష్ పాల్గొన్నారు.

**పేదల పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి**

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే నిలుస్తారని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నిడుముక్కల శివశంకరరావు, సచివాలయాల కన్వీనర్ లంకే అంకమోహనరావు అన్నారు. ఇబ్రహీంపట్నం–5వ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వారు పాల్గొని సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. కొండపల్లి కన్వీనర్ మిక్కిలి శరభయ్య, దయాకర్, చిన్నయ్య, శ్రీను పాల్గొన్నారు. తుమ్మలపాలెంలో ఎంపీపీ పాలడుగు జోత్స్న, గ్రామ సర్పంచ్ వెంకట రమణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సాంబశివరావు, దుర్గగుడి కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, సచివాలయాల మండల కోఆర్డినేటర్ వెంకటేష్, గ్రామ కన్వీనర్ చిట్టిబాబు, రామయ్య పాల్గొని అభివృద్ధి సంక్షేమ పథకాల పోస్టర్, వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు.

**విస్సన్నపేటలో..**

విస్సన్నపేట: అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క పేదవాడికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అన్నారు. స్థానిక సచివాలయం–3 పరిధిలో పల్లెకుపోదాం, ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి డిస్‌ప్లే బోర్డును వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను మండల పార్టీ అధ్యక్షుడు ఆవిష్కరించి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమలో ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సర్పంచ్ నాగమల్లీశ్వరి, సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ శివబాజీ, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**రెడ్డిగూడెంలో..**

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం సచివాలయం–1 పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారన్నారు. జగనన్న అడుగుజాడల్లో నడుస్తూ మళ్లీ 2024 జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మళ్లీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోపెట్టేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొలగాని తిరుపతిరావు, మండల సచివాలయ కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మల్లాది రాణీ, నాయకులు వీరస్వామినాయుడు, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు పాల్గొన్నారు.

**లబ్ధిదారుల ఖాతాకే నేరుగా సంక్షేమ నిధులు**

తిరువూరు: సంక్షేమ పథకాలలో ఎటువంటి లోపాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు జమ చేస్తోందని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. తిరువూరు 16,17 వార్డు సచివాలయంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. తిరువూరులోని ప్రతి వార్డులో రూ.7 కోట్లకు పైగా సంక్షేమపథకాల నిధులను నాలుగున్నరేళ్ళలో ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సంక్షేమపథకాలను మరింత పారదర్శకంగా అమలు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. నగర పంచాయతీ వైస్‌చైర్మన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు ఇన్‌చార్జిలు తిరుమలశెట్టి వేణుబాబు, షేక్ జాకీర్, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాలనాగేశ్వరరావు, పాపారావు, నాగేశ్వరరావు, నెహ్రూ, శోభన్ పాల్గొన్నారు.

**పేదల కోసమే పథకాలు**

చౌటపల్లి(తిరువూరురూరల్): అర్హులందరికీ సంక్షేమ పథకాలందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. తిరువూరు మండలం చౌటపల్లిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు తాళ్లూరి నవీన్, సీతారామయ్య, కిషోర్, చౌటపల్లి సర్పంచ్ రాజేశ్వరి, ఈఓపీఆర్‌డీ వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు వినోద్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**జి.కొండూరులో..**

జి.కొండూరు: మండలంలోని గడ్డమణుగు గ్రామంలో పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులు గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. గ్రామంలో ఇప్పటి వరకు ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు.

**హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే**

మైలవరం: ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం సచివాలయం–4 ఏరియాలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పిలుపు మేరకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు.

**నేడు 'పల్లెకుపోదాం'**

విస్సన్నపేట: విస్సన్నపేట సచివాలయం–4 పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి తెలిపారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం స్థానిక సచివాలయం–3 పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లోకేశ్వరరెడ్డి తెలిపారు.



తిరువూరు మండలం చౌటపల్లిలో 'పల్లెకు పోదాం'



ఇబ్రహీంపట్నంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు



విస్సన్నపేటలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లోకేశ్వరరెడ్డి



రెడ్డిగూడెంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి



తిరువూరులో పల్లెకు పోదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న గత్తం కస్తూరిబాయి



జి.కొండూరు మండలం గడ్డమణుగులో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

# పుస్తక పఠనం అలవర్చుకోవాలి

తిరువూరు: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో రెండోరోజు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కమిషనర్ ఈ ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తమ పిల్లలు సెల్‌ఫోన్లకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు.

**పుస్తక ప్రదర్శన**

జి.కొండూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై పుస్తక పఠనం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి విజయకృష్ణ పాల్గొన్నారు.

**విస్సన్నపేటలో..**

విస్సన్నపేట: గ్రంథాలయ వారోత్సవంలో భాగంగా విస్సన్నపేట గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం ఎంఈఓ సుధాకర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ పి.భాను తెలిపారు.

**పెనుగొలనులో..**

పెనుగొలను(గంపలగూడెం): గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను విద్యార్థులు వినియోగించుకుని తమ విజ్ఞాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ–2 పీవీడీఎల్ నరసింహారావు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తకప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఎంఈఓ–1 శ్యామ్‌సుందరరావు, పెనుగొలను హైస్కూల్ హెచ్‌ఎం కృష్ణాఫర్, విశ్రాంత ఎంఈఓ శేషిరెడ్డి, గ్రంథాలయ అధికారి శ్రీలత పాల్గొన్నారు. గంపలగూడెం గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు నాగేంద్రరావు, మల్లికార్జునరావు, కృష్ణ, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

**మైలవరంలో..**

మైలవరం: గ్రంథాలయాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మైలవరం మండల విద్యాశాఖాధికారి ఎల్.బాలు పేర్కొన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర హైస్కూల్ ఉపాధ్యాయులు రవికుమార్, గ్రంథాలయ సిబ్బంది నాగార్జున, సయ్యద్ అహ్మద్ పాల్గొన్నారు.



జి.కొండూరు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న పాల్గొన్న విద్యార్థులు

**గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు**

చాట్రాయి: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ఎంఈఓ వీఎస్‌వీ బ్రహ్మాచారి తెలిపారు. బుధవారం మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రామాల్లో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాల అధికారులు శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

**గోపవరంలో..**

గోపవరం(ముసునూరు): గ్రంథాలయాలతోనే విద్యార్థులకు, పాఠకులకు పుస్తక పఠనం అలవడుతుందని వక్తలు పేర్కొన్నారు. బుధవారం గోపవరం బ్రాంచి గ్రంథాలయంలో శాఖాధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

**విద్యార్థి దశ నుంచే పుస్తకాలను చదవాలి**

నూజివీడు: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని స్థానిక ఎమ్మార్ ఏఆర్ కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల ప్రిన్సిపాల్ ఆచార్య మండవ వెంకట బసవేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను బసవేశ్వరరావు ప్రారంభించారు.

**గ్రంథాలయాలు మార్గదర్శకాలు**

ఆగిరిపల్లి: విద్యార్థులకు గ్రంథాలయాలు మార్గదర్శకాలని ఎంఈఓ–2 కొవ్వలి ఆనంద్‌కుమార్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో ఎంఈఓ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### దివ్యాంగ బాలలకు కృత్రిమ అవయవాలు అందజేత

ఆగిరిపల్లి: పుట్టుకతో లేదా ప్రమాదంలో అవయవాలు కోల్పోయిన దివ్యాంగ బాలలకు హీల్ సంస్థ అందిస్తున్న కృత్రిమ అవయవాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని ధనశిక్ష చారిటీస్ సంస్థ డైరెక్టర్ మగతం అమిత్‌కుమార్ అన్నారు. మండలంలోని తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ధన శిక్ష సంస్థ, రెడ్ షిఫ్ట్ సంస్థల ఆర్థిక సాయంతో తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా కూసుమంచికి చెందిన రమ్యశ్రీ, పెద్దఓరాకు చెందిన డి అంచిత, మోతే మండలానికి చెందిన ఎమ్ రమ్యశ్రీ, తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడకు చెందిన టి ప్రియాంకకు కృత్రిమ కాళ్లు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ముంబయి సంస్థకు చెందిన ప్రముఖ చిత్రకారిణి అనితారావు, హీల్ సీఈవో కూరపాటి అజయ్ కుమార్, సీనియర్ టెక్నీషియన్ కె చిన్నా పాల్గొన్నారు.

# 'దొంగే దొంగ' అనే సామెతగా ఉమా వ్యాఖ్యలు



సమావేశంలో పాల్గొన్న సత్యనారాయణరెడ్డి, వెంకట్రావు, నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి

మైలవరం: దొంగే దొంగ అన్ని సామెతగా మాజీ మంత్రి దేవినేని ఉమా వ్యాఖ్యలు ఉన్నాయని, బొంగురు గొంతుతో బొంకుతుంటే సొంత పార్టీ నేతలే నవ్వుకుంటున్నారని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను తప్పు చేసి ఎదుటి వారికి ఆపాదించడంలో మాజీ మంత్రికి వెన్నతో పెట్టిన విద్య అని, మాజీ మంత్రి ఉమా పిచ్చి రోజు రోజుకు పరాకాష్టకు చేరుతుందన్నారు. ఇటీవల ప్రభుత్వం, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పై దేవినేని ఉమా చేస్తున్న కామెంట్‌లను తిప్పికొడుతూ వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. టీడీపీ హయాంలో నీరు చెట్టు పేరుతో మైలవరం నియోజకవర్గ స్థాయిలో ఉన్న చెరువుల్లో వేలు, లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వుకుని విచ్చలవిడిగా ఇటుక బట్టీలకు అక్రమంగా అమ్ముకుని కోట్ల రూపాయలు ప్రజాధనం దోచుకున్న నీచుడు మాజీ మంత్రి ఉమా అన్నారు. ఉమా గురించి ప్రజలందరికీ తెలుసని, అప్పుడు ఎంత మందిపై పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా ఫిర్యాదు చేసి, ఇబ్బందులు పెట్టిందీ తెలుసన్నారు. గంజాయి బ్యాచ్‌కు అండగా ఎవరున్నదీ, వారిని కాపాడేందుకు ఎవరు పాటుపడుతున్నారో టీడీపీలోని వారే చర్చించుకుంటున్నాని ఆరోపించారు. రాజకీయ నిరుద్యోగిగా ఉన్న ఉమాకు మతి భ్రమించి మాట్లాడటం పరిపాటిగా మారిందని, పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి, పుల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణారెడ్డి, నాయకుడు ఇస్లావత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

### బహుమతుల పంపిణీ

చాట్రాయి: మర్లపాలెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ఎఫ్ఎ–2లో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు, ఆటల పోటీల్లో విజేతలకు సోమవరం సర్పంచ్ శోభన్‌బాబు, దాత సునీల్ చక్రవర్తుల సహకారంతో బహుమతులు పంపిణీ చేశారు.

# జగనన్న పాలనలోనే అభివృద్ధి సాధ్యం

పొందుగల(మైలవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి తెలిపారు.

మైలవరం మండలం పొందుగల గ్రామంలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులను ఎంపీపీ ప్రసన్నరాణిస్వామి, సర్పంచ్ గుగులోతు కోటమ్మ బుధవారం ప్రారంభించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సహకారంతో గ్రామాల్లో ముమ్మరంగా అభివృద్ధి పనుల సాగుతున్నాయని, ఈ నేపథ్యంలోనే పొందుగల గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20లక్షలతో బైపాస్ నందు వంతెన నిర్మాణం ప్రారంభించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు మందా రామారావు, మాజీ గ్రామ సర్పంచ్‌లు బొడ్డపాటి రాజా, చలపతిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇస్లావత్ స్వామి, రాంబాబు, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ముసునూరు ఎంపీపీ ఎన్నిక

ముసునూరు: మండల ఎంపీపీ ఎన్నికను గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. ఇప్పటి వరకు ఎంపీపీగా పని చేసిన కాట్రేనిపాడు ఎంపీటీసీ సభ్యురాలు రాపర్ల కృష్ణకుమారి అనారోగ్య కారణంతో గత నెల 17న రాజీనామా సమర్పించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో తాత్కాలిక ఎంపీపీగా లోపూడి ఎంపీటీసీ సభ్యుడు రాజానాయన వ్యవహరించారు. కృష్ణా జిల్లా పరిషత్ సీఈఓ, ఏలూరు జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు అందడంతో నూతన ఎంపీపీగా రమణక్కపేట ఎంపీటీసీ సభ్యురాలు కొండా దుర్గా భవానిని ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

# కేడీసీసీ బ్యాంక్ భవన సముదాయం ప్రారంభోత్సవం నేడే

- నెరవేరిన రెండు దశాబ్దాల కల
- రూ.1.74 కోట్లతో సొంత భవన సముదాయం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో ఒనగూరిన భవనం



కేడీసీసీ బ్యాంక్ నూతన భవన సముదాయం

గంపలగూడెం: రైతాంగానికి విశిష్ట సేవలను అందించేందుకు కృష్ణాజిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్ గంపలగూడెం శాఖకు సొంత భవన సముదాయం ఏర్పాటు చేయాలన్న రెండు దశాబ్దాల కల ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నెరవేరింది. 11 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు కల్గిన గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్‌ను 1979 మార్చి 24వ తేదీన ఏర్పాటు చేశారు. నాటి నుంచి అద్దె భవనంలోనే అరకొర వసతులతో బ్యాంక్ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. సొంత భవనం నిర్మించాలని దీర్ఘకాలంగా చేస్తున్న ప్రతిపాదనలు మాత్రం అమలుకు నోచుకోలేదు. ఎట్టకేలకు తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి చొరవతో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు హయాంలో పాలకవర్గం, అధికారులు భవన నిర్మాణానికి కావాల్సిన నిధులను కేటాయించారు. దీంతో బ్యాంక్ భవన నిర్మాణానికి గత ఏడాది డిసెంబర్ 15వ తేదీన ఎమ్మెల్యే రక్షణనిధి, అప్పటి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచి భవన నిర్మాణ పనులను చేపట్టి తొమ్మిది నెలల వ్యవధిలోనే పూర్తి చేశారు. బ్యాంక్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ మల్లాది యేసోబు, కొండయ్య పర్యవేక్షణలో బ్యాంక్ ఏఈ వై శ్రీనివాసరావు పనులను కొనసాగించారు. నూతన భవన సముదాయం చూడముచ్చటగా గొల్పుతుంది.

**భవన సముదాయానికి రూ.2.58 కోట్లు కేటాయింపు**

బ్యాంక్ భవనసముదాయం నిర్మాణానికి అవసరమైన 15 సెంట్ల స్థలాన్ని స్థానిక కుమ్మరబజారులో ఎంపిక చేసి రూ.84.16 లక్షలతో కొనుగోలు చేశారు. కావాల్సిన వసతులతో రూ.1,74,62,459 ఖర్చుతో ఒక అంతస్తు భవన సముదాయం సకలవసతులతో చూడముచ్చటగా నిర్మించారు. దిగువభాగంలో బ్యాంక్ కార్యకలాపాలకు అవసరమైన వసతులు, రికార్డు రూమ్, స్టోర్‌రూమ్, స్ట్రాంగ్‌రూమ్, లాకర్‌రూమ్, స్వంత జనరేటర్, మొదటి అంతస్తులో మీటింగ్ హాలు, విశ్రాంతిరూమ్‌లను నిర్మించారు. బ్యాంక్ ఆవరణలోనే ఏటీఎం వసతికి గది ఏర్పాట్లు చేశారు.

**నేడు ప్రారంభం**

కేడీసీసీ బ్యాంక్ నూతన భవనసముదాయాన్ని గురువారం ప్రారంభించనున్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి, తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి చేతుల మీదుగా ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారు.

### విద్యార్థులకు స్టీల్ ప్లేట్స్ పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి ఆధ్వర్యంలో స్టీల్ భోజన ప్లేట్స్, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ధనేకుల భరత్, మద్దాలి శ్రీనివాస్, కోశాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో వినియోగించుకునేందుకు ప్లేట్లను అందజేశామని తెలిపారు. క్లబ్ ప్రతినిధులు వెంకట్, అనిల్‌కుమార్, రత్నబాబు, హెచ్‌ఎం రాక్ ఫెల్లర్, పాల్గొన్నారు.